క్లుప్తంగా

శ్రీరెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు ఆలయ పరిసరాల్లో ఆకుపసరు సేవించి కోనేరులో స్నానమాచరించి తడిబట్టలతో అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. రాయలసీమ జిల్లాలోతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి



వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

బి.కొత్తకోట: వేసవి సెలవుల చివరి ఆదివారం కావడంతో పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ సందర్శకులతో కిటకిటలాడింది. గాలి బండ, వ్యూ పాయింట్లు, అటవీ సముదాయం, ప్రకృతి అధ్యయన కేంద్రం వద్ద సందర్శకులు ప్రకృతి అందాలను తిలకించారు. చల్లటి వాతావరణంలో చెట్ల కింద సేద తీరారు. కుటుంబాలతో వచ్చిన వారు విందు వినోదాలతో సందడి చేశారు. వైఎస్సార్, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చారు.

ప్రశాంతంగా 6వ తరగతి ప్రవేశ పరీక్షలు



మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు విద్యార్థులను తీసుకొచ్చిన తల్లిదండ్రులు

రామసముద్రం : మండలంలోని దిన్నిపల్లె సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 162 మంది పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ తెలిపారు. 6వ తరగతికి మొత్తం 100 సీట్లు కేటాయించారని, పరీక్షల ఫలితాలు ఈ నెల 15వ తేదీ లోపల విడుదల అవుతాయని ఆయన చెప్పారు. ఫలితాల అనంతరం విద్యార్థులకు వచ్చిన మార్కుల మెరిట్ రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష కేంద్రాన్ని పాఠశాల డిపార్టుమెంటల్ అధికారి గోపాల్‌రెడ్డి పర్యవేక్షణ చేశారు.

20 మంది గైర్హాజరు

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశం కోసం ఆదివారం పరీక్ష నిర్వహించారు. మొత్తం వంద మంది విద్యార్థులు ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 80 మంది పరీక్షకు హాజరు కాగా 20 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు.

మంచి అలవాట్లు, సంస్కారం అలవర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గుర్రంకొండ : మంచి అలవాట్లు, సంస్కారం మనిషిని అత్యున్నతస్థాయికి చేరుస్తుందని రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో వేసవి వెన్నెల సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. నెల రోజుల పాటు సమ్మర్ క్యాంప్‌లో భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సంస్కారం, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం, యోగా, ధ్యానం, డ్రాయింగ్, పెయింటింగ్ మొదలగు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకొన్న విద్యార్థిని, విద్యార్థులకు గుర్తింపు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకొనేందుకు గానూ హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వారి సహకారంతో వేసవి వెన్నెల సమ్మర్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్రీవాణి కరస్పాండెంట్ శ్రీలత, ఆంజనేయ స్వామి మాలాధారణ గురువు శ్రీనివాసులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవీంద్ర, సిబ్బంది వెంకటరమణ, రమణయ్యలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- పూర్తి కావస్తున్న టిడ్కో గృహాలు
- 1,872 గృహాలకు 1,392 ఇళ్లు వంద శాతం పూర్తి
- శరవేగంగా రోడ్లు, డ్రెయిన్లు, ఎస్టీపీ ప్లాంటు, జీఎల్ఎస్ఆర్ పనులు
- జూలైలో పంపిణీకి అధికారుల సన్నాహాలు



నిర్మాణాలు పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లు



నిర్మాణదశలో ఎస్టీపీ ప్లాంటు

మదనపల్లె : పేదల సొంతింటి కల సాకారం అయ్యే తరుణం ఆసన్నమైంది. ఇళ్లు కట్టుకునే స్తోమత, సౌకర్యం లేని పేదల కోసం ప్రభుత్వమే నిర్మించి ఇస్తున్న టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే మున్సిపల్ అధికారులు టిడ్కో గృహాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓటర్లను ప్రలోభపెట్టే క్రమంలో టిడ్కో ఇళ్ల పేరుతో హంగామా చేసి, నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేశారు. పేదలైన లబ్ధిదారులకు మేలు చేకూర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహాలను పూర్తి చేసి ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మంజూరైన మొత్తం 1,872 గృహాలకు 1,392 గృహాలు 100 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాయి. టీడీపీ హయాంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన 480 గృహాల నిర్మాణ పనులు ప్రస్తుతం పునఃప్రారంభమయ్యాయి. బ్లాక్ కాంక్రీట్ వర్క్ పూర్తవుతోంది.

పట్టణంలోని పేదల కోసం టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు మదనపల్లె మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏపీ టిడ్కో– పీఎంఏవై(అర్బన్) పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న నగర్ పేరుతో వెంకప్పకోటలో రూ.77.64 కోట్ల వ్యయంతో 35.81 ఎకరాల విస్తీర్ణంలో 1,872 ఇళ్లు(300చ.అడుగులు) నిర్మాణానికి పూనుకున్నారు. వీటిలో టీడీపీ ప్రభుత్వంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.24.48 కోట్లతో 10 బ్లాకుల్లో 480 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి 8 బ్లాకుల్లో స్ట్రక్చర్ పూర్తి చేసింది. రెండు బ్లాకుల్లో పనులు జరగాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాస్ ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.53.16 కోట్ల విలువతో 29 బ్లాకుల్లో 1,392 ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయి. వీటికి సంబంధించి మౌలికవసతుల కల్పనలో భాగంగా రూ.14.36 కోట్లతో రోడ్లు, సెవరేజ్‌లైన్స్, డ్రెయిన్స్, రిటైనింగ్ వాల్స్, వాటర్‌సప్లై, బోర్‌వెల్స్ తదితర వసతులకు సంబంధించి పనులు చివరి దశలో ఉన్నాయి. రూ.3.23 కోట్లతో ఎస్టీపీ(సెవేజ్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్), రూ.1.88 కోట్లతో ఎలక్ట్రిసిటీ సదుపాయాలు కల్పిస్తున్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 18.5.2023 తేదీకి 1,706 గృహాలకు లబ్ధిదారుల పేరుమీద రిజిస్ట్రేషన్‌లు పూర్తయ్యాయి. ఇటీవల ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ టిడ్కో గృహాలను సందర్శించి నిర్మాణ పనులు శరవేగంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాల్సిందిగా మున్సిపల్ అధికారులకు సూచించారు.

జూలైలో టిడ్కో గృహ ప్రవేశాలు



టిడ్కో గృహాలకు సంబంధించి 1,392 గృహాలు వందశాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన 480 ఇళ్లు పూర్తి కావాల్సి ఉండగా, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మౌలికవసతుల కల్పనకు సంబంధించి పనులు పూర్తవుతున్నాయి. టిడ్కో గృహాల ప్రగతిపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన వెంటనే జూలైలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె

నాటుసారా, బైక్ స్వాధీనం

మదనపల్లె : మండలంలోని దాదినాయునితండాకు చెందిన రవినాయక్ బైక్‌లో 36 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సారా తరలిస్తున్న రవినాయక్‌ను అరెస్ట్ చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకుని నాటుసారా సీజ్ చేశామన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై తమకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటుగా స్థావరాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్ర, మునిరామయ్య, రూపకుమార్, ప్రసన్న పాల్గొన్నారు.

'నేతన్న నేస్తం'కు దరఖాస్తుల ఆహ్వానం

బి.కొత్తకోట : నేతన్న నేస్తం పథకానికి అర్హులైన వారు ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత, కొత్త దరఖాస్తులను ఈ నెల 21 నుంచి 23 వరకు పరిశీలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 28, 29 తేదీల్లో తాత్కాలిక అర్హులు, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులకు ఎంపిక జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా, ఎంపిక కాని వారు ఈ నెల 30 నుంచి జూలై 7వ తేది వరకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. జూలై 6, 7 తేదీల్లో అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని, దీనిపైనా జూలై 5వ తేదిలోగా దరఖాస్తుదారులకు అభ్యంతరాలుంటే తెలియజేసుకోవచ్చన్నారు.

మారాం.. మాన్పించాలి

- హాలిడే మూడ్ నుంచి బయటకు తేవాలి
- బడికి చిన్నారులను సన్నద్ధం చేయండిలా
- హుషారు నింపి, బడికి పంపాలి



మదనపల్లె సిటీ: వేసవి సెలవులు ముగిశాయి. పిల్లలు మళ్లీ పుస్తకాల బ్యాగు పట్టాల్సిందే. ఇన్ని రోజులు ఆటపాటలతో సందడి చేసిన పిల్లలు బడికెళ్లబోమని మారాం చేయడం సహజం. కానీ వీరి ఆలోచనలను ఆటల నుంచి బడి బాట వైపు మళ్లించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

పిల్లలూ.. ఇక బారెడు పొద్దెక్కేదాక నిద్రపోవడా లుండవు. అర్ధరాత్రి దాకా సెల్‌ఫోన్లు, కార్టూన్, పోగో, టీవీలు చూడటం ఉండదు. ఒక్కసారిగా టైంటేబుల్ మారిపోతుంది. మరి చిన్నారులు వెంటనే ఈ మార్పులకు సై అనగలరా? సెలవుల్లో మూలపడేసిన క్రమశిక్షణ అర్జంటుగా అలవరుచుకోగలరా? కొంత ఇబ్బందే. చిన్నారుల ఈ మానసిక స్థితిని తల్లిదండ్రులు, ఆపైన ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలి. ఈ మేరకు వారిని పాఠశాలకు సన్నద్ధం చేయాలి. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

బాధించొద్దు

శని,ఆదివారాల్లో సెలవులను ఎంజాయ్ చేసిన ఉద్యోగులు సోమవారం ఆఫీసుకు వెళ్లేందుకు కొంత ఇబ్బందులు పడతారు. వేసవి సెలవుల తర్వాత పిల్లల పరిస్థితి ఇంతకంటే బాధాకరంగా ఉంటుంది. స్కూల్‌కు వెళ్లేందుకు త్వరగా రెడీ అవ్వరు. కావాలని ఆలస్యం చేసి ఇంట్లోనే ఉండిపోవాలని చూస్తారు. వీరిని తల్లిదండ్రులు కొట్టడం లాంటివి చేస్తుంటారు. కానీ సున్నితంగా చెప్తేనే ఫలితం ఉంటుంది. బడి పునః ప్రారంభంలో పిల్లలు నిరాశతో కన్పిస్తారు. హోమ్‌వర్కు చేయకపోవడంతో డల్‌గా ఉన్నాడా.. లేక ఇంకేదైనా ఆశిస్తున్నాడా.. అనేది తెలుసుకోవాలి. అప్పుడే మైండ్ సెట్ మార్చవచ్చు. ముందుగా వారి లక్ష్యం గురించి సావధానంగా వివరించండి. చదువుకుంటేనే అవి నెరవేరుతాయని మనసుకు హత్తుకునేలా చెప్పండి.

భయాన్ని తొలగించాలి

వేసవి సెలవుల్లో ఇష్టమైన ఆటపాటల్లో నిమగ్నమైన పిల్లలు స్కూల్‌కు వెళ్తే ఇలాంటి వాతావరణం కోల్పోతామని భయపడతారు. అందుకే మారాం చేస్తుంటారు. కానీ చదువుతో పాటు ఇష్టమైన ఆటలు సైతం ఆడుకోవచ్చని వారికి నచ్చజెప్పాలి.

కొత్తదనం ఉండాలి

తొలిసారి స్కూల్‌కు వెళ్లేవారు ఎంతో ఉత్సాహంగా ఉంటారు. రంగు రంగుల పుస్తకాలు, ఆటలు ఇలా వారు ఎంతో ఊహించుకుంటారు. మారాం చేయరు. అలాంటి వాతావరణం ఏటా పిల్లలకు కన్పించాలి. చాలా మంది తల్లిదండ్రులు తొలిసారి పిల్లలను స్కూల్‌లో చేర్పించినప్పుడు కనబర్చే శ్రద్ధ తర్వాత చూపరు. ఇది సరికాదు.

వాచ్‌ను సెట్ చేయాలి

పాఠశాల ప్రారంభపు రోజుల్లో పొద్దున్నే లేవండి... అంటూ తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. వారి మైండ్ సెట్‌లో ఉన్న వేళలు ఒకేసారి మారిపోవాలంటే కష్టం. దానికి కొంత సమయం పడుతుంది. నెమ్మదిగా వారి సమయాల్లో మార్పులు తీసుకురావాలి. వారి దినచర్యను ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ ఆ ప్రకారం నడుచుకోవాలి.

ఒకే మాట అవసరం

క్రమశిక్షణ విషయంలో తల్లిదండ్రులు ఒకే మాటగా ఉండాలి. చాలా మంది పిల్లలను అమ్మ నిద్ర లేపుతుంటే నాన్న పడుకోనివ్వు అంటుంటారు. ఇలా చేయొద్దు.

పిల్లల అభిప్రాయాలు వ్యతిరేకించొద్దు



పిల్లల అభిప్రాయాలను ఒకేసారి వ్యతిరేకించొద్దు. నెమ్మదిగా వారిని మళ్లించాలి. వేసవి సెలవుల్లో స్వేచ్ఛగా ఉంటారు. క్రమంగా వారిని స్కూల్ వాతావరణానికి మార్చాలి. ఆటల నుంచి పిల్లలను బయటకు తీసుకురావాలి. పిల్లలను బెదిరించవద్దు. చనువుగా మెలగాలి.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

ఆసక్తి కలిగించేలా మాట్లాడాలి



ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడికి వెళ్లడానికి భయపడుతుంటారు. వారిని ముందు నుంచే వారిలో ఆసక్తి కలిగేలా పాఠశాల గురించి, పుస్తకాలు, స్నేహితుల గురించి తల్లిదండ్రులు మాట్లాడాలి. అలా క్రమంగా వారిలో బెరుకు పోగొట్టాలి. బడికెళ్లిన వెంటనే పాఠాలు బోధించకుండా మొదట వారం పాటు ఉపాధ్యాయులతో మమేకం కావాలి.

–జిల్లా లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు

అభివృద్ధే ధ్యేయంగా పాలన



గూడుపల్లెలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : పేదల సంక్షేమంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆదివారం గూడుపల్లి, కాలువపల్లి సచివాలయాల పరిధి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటపల్లె, తనకంటివారిపల్లె, రెడ్డివారిపల్లె, గూడుపల్లె, బుద్దలవారిపల్లె, కాలువపల్లె, బాటావారిపల్లెలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు.

వందశాతం హామీలు అమలు

గత టీడీపీ ప్రభుత్వం పూర్తి రుణమాఫీ చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ఊసే ఎత్తలేదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. టీడీపీ కార్యకర్తలకు మాత్రం పక్కాగృహాలు మంజూరు చేశారని, పేదలను గాలికి వదిలేశారన్నారు. హామీలు నెరవేర్చని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దింపారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇంటి వద్దకే సచివాలయ పాలన, నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ, పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, హామీ ఇస్తే పక్కాగా అమలు చేస్తుందని బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఘన విజయం కట్టబెట్టనున్నారని, సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

ఓటీఎస్ పథకం ద్వారా డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ములకలచెరువు సచివాలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ములకలచెరువు సచివాలయం పరిధిలో 80 మంది ఓటీఎస్ పథకం ద్వారా డబ్బులు చెల్లించినట్లు ఎంపీడీఓ అశ్వని చెప్పారు. చెల్లించిన ప్రతి ఒక్కరికీ పట్టాలు పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, సింగిల్ విండో చైర్మన్ ఏవీ గౌరీశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు రెడ్డెప్ప, రహ్మత్‌బీ, మహబూబ్‌బాషా, ఎంపీటీసీలు మల్లికార్జున, గోరా వెంకటరమణారెడ్డి, గోరా రవీంద్రారెడ్డి, నాయకులు కుల్‌దీప్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, జయరాంరెడ్డి, బావాజాన్, యాసీన్, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు



కలికిరి: శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఎస్ఐ రహీముల్లా



మదనపల్లె సిటీ : విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

కలికిరి : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు అని ఎస్ఐ రహీముల్లా అన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలతో నైపుణ్యాలు పెంచుకోవచ్చని అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గుర్తింపు పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో గ్రాంథాలయ అధికారి విజయ్‌కుమార్, వీఆర్ఓ నరేంద్రరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం క్రిష్ణప్ప మాట్లాడుతూ 35 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జిలానీబాషా, టీచర్ వెంకటకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కలకడ : వేసవి కాలంలో గ్రంథాలయ శాఖలో నిర్వహించిన ఆటల పోటీలు, వివిధ రంగాలలో రాణించిన విజేతలకు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ్ బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో మేధస్సును పెంచడానికి ఉపయోగపడే చెస్, చెకుముకి, క్యారంబోర్డ్, నీతికథలు వంటివాటిలో పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

పీలేరు : స్థానిక గ్రంథాలయంలో గత నెల 8వ తేది నుంచి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ముగిశాయి. విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సంగీతం టీచర్ లక్ష్మీశ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అమర్‌నాథ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను గ్రంథాలయాలకు తీసుకెళ్లాలి

మదనపల్లె సిటీ : తల్లిదండ్రులు పిల్లలను సమీపంలోని గ్రంథాలయాలకు వారంలో ఒక్క రోజైనా తీసుకెళ్లాలని బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళితే అక్కడ ఉన్న పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయల్లో పుస్తకాలు చదవడం వల్ల ఎంతో మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో పఠనాశక్తి పెంచడానికి చదవడం మా కిష్టం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, రిటైర్డు మున్సిపల్ కమిషనర్ సహదేవరావు, రెడ్డప్ప, మదన్‌మోహన్, రచయితలు టీఎస్ఏ కృష్ణమూర్తి, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఎంపీ విరాళం



ఎల్లుట్లలో ఆలయ నిర్వాహకులకు రూ.2 లక్షలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్రంకొండ : మండలంలోని ఎల్లుట్ల పంచాయతీలో రెండు దేవాలయాలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. ఇటీవల ఎల్లుట్ల పంచాయతీలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో రాజువారిపల్లెలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి, నల్లగుట్టపల్లెలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎల్లుట్లలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు వెంకటశివారెడ్డి, ఎంపీటీసీలు రాజగోపాల్, రెడ్డికుమార్‌లు ఆలయ నిర్వాహకులకు ఎంపీ తరపున రూ.2 లక్షల నగదు అందజేశారు.

మారెమ్మ ఆలయానికి రూ.50 వేలు

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తండా మారెమ్మ ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి విరాళాన్ని మారెమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులకు అందజేశారు. అలాగే గరిష్మిట్ట ఆలయానికి రూ.15 వేలతో మైక్‌సెట్, జాండ్ల పంచాయతీ సూర్యనాయక్ తండా ఆలయానికి రూ.10 వేల విరాళం అందజేశారు. ఎంపీ సహకారంతో ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులు రూ. 3 లక్షలతో స్థానిక యల్లమంద క్రాస్‌లో బస్ షెల్టర్ మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు ఉదయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ రద్రేనాయక్, గ్రామస్తులు మణికంటేశ్వర్‌నాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పూర్వ వైభవం తీసుకువస్తాం



ట్రోఫీ అందజేస్తున్న ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి

మదనపల్లె సిటీ : హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకువస్తామని సీనియర్ కోచ్‌లు పి.ప్రసాద్‌రెడ్డి, నౌషాద్ అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. హాకీలో మదనపల్లెకు చెందిన క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వేసవి శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పోర్ట్సు స్కూల్స్‌లో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది వేసవి శిబిరంలో సుమారు 60 మందికి హాకీలో శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణతో పాటు మెలకువలు నేర్పించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి ట్రోఫీ, మెమెంటోలు అందజేసినట్లు తెలిపారు.

ముగిసిన నలసానమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీనలసానమ్మ

కలకడ : నడిమిచెర్ల పంచాయతీ గ్రామదేవత నలసానమ్మ ఉత్సవాలు ఆదివారం ఇంటింటా బోనం సమర్పించి, మొక్కులు చెల్లించి ముగించారు. ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాది 5 రోజుల పాటు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి చాందినీ బండ్లు ప్రదక్షిణలు, ఆదివారం అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలంకరించిన చాందినీబండ్ల ముందు కోలాటం, పిల్లనగ్రోవి, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మొక్కులు చెల్లించిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

యల్లమ్మకు ప్రత్యేక పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బోనాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.